క్లుప్తంగా

కోనాం సచివాలయంలో ఎంపీడీవో తనిఖీ



రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంపీడీవో జయప్రకాష్‌రావు

మాడుగుల రూరల్: చీడికాడ మండలం కోనాం గ్రామ సచివాలయాన్ని ఎంపీడీవో కె. జయప్రకాష్‌రావు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటించి సక్రమంగా విధులు నిర్వహించి, ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండాలని సూచించారు. సచివాలయంలో రికార్డులను పరిశీలించారు. వలంటీర్లు పూర్తిస్థాయిలో విధులు నిర్వహించాలని సూచించారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ప్రజలుకు అందుబాటులో ఉండాలన్నారు.

నూకాంబిక పంచలోహ విగ్రహం వితరణ



దాతలు అందించిన నూకాంబిక పంచలోహ విగ్రహం

మాడుగుల రూరల్: కె.జె.పురం చెరకు కాటా ఆవరణలో నూకాంబిక ఆలయానికి అమ్మవారి పంచలోహ విగ్రహాన్ని గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు భీశెట్టి ముత్యాలనాయుడు, వెంకటలక్ష్మి దంపతులు బహూకరించారు. దీన్ని సోమవారం ఆలయ కమిటీ వారికి అందజేశారు. నూకాంబిక భజన బృందం, అర్చకులు ఇక్కడ విగ్రహానికి నిత్య పూజలు చేస్తారని ఆలయ కమిటీ వారు తెలిపారు.

పాఠశాలలకు టాయిలెట్, స్పోర్ట్స్ కిట్స్ సిద్ధం



ఉపాధ్యాయినికి టాయిలెట్ కిట్స్ అందజేస్తున్న ఎంఈవో జగ్గారావు

రోలుగుంట: మండలంలో 54 ప్రభుత్వ పాఠశాలలకు స్పోర్ట్స్ కిట్స్, టాయిలెట్ సామగ్రి, గ్రంథాలయాల పుస్తకాలు పంపిణీ చేసేందుకు స్థానిక ఎమ్మార్సీ భవన్‌లో సిద్ధంగా ఉన్నాయని ఎంఈవో పి.జగ్గారావు తెలిపారు. వాటిని సోమవారం వడ్డిప ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయిని పి.సుశీలకు సిబ్బందితో కలసి అందజేశారు. మిగిలిన పాఠశాలలకు సమాచారం ఇచ్చామన్నారు. ఇక్కడకు వచ్చి తీసుకెళ్లాలని సూచించారు.

డివైడర్‌పైకి దూసుకెళ్లిన కాంక్రీట్ లారీ



చిక్కుకున్న లారీని జేసీబీతో తీస్తున్న దృశ్యం

మాకవరపాలెం: కాంక్రీట్ మిక్సర్ లారీ రోడ్డు డివైడర్‌పైకి దూసుకుపోయింది. సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకున్న ఈ సంఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం కాలేదు. నర్సీపట్నం నుంచి అనకాపల్లి వైపు వెళ్తున్న కాంక్రీట్ మిక్సర్ లారీ మండల కేంద్రానికి వచ్చేసరికి రోడ్డు మధ్యలో డివైడర్‌పైకి దూసుకుపోయి చిక్కుంది. దీంతో లారీని జేసీబీ సాయంతో బయటకు తీయాల్సి వచ్చింది.

రహదారి భద్రతపై అవగాహన ర్యాలీ

దేవరాపల్లి: వైఎస్సార్ క్రాంతి పథం (వెలుగు) ఆధ్వర్యంలో సోమవారం దేవరాపల్లిలో రహదారి భద్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఉన్నత పాఠశాల నుంచి మెయిన్ రోడ్డు కూడలి వరకు ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడ్డారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనం నడపరాదని నినాదాలు చేశారు. వెలుగు ఏపీఎం ఎస్. ప్రభాకర్, హెచ్ఎం బి. పడాల దాస్, సచివాలయ సంరక్షణ కార్యదర్శులు సంధ్య, ఎస్.కె. మీరాబి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

మిన్నంటిన ప్రజా సంకల్పయాత్ర సంబరాలు

- సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రకు ఆరేళ్లు
- వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ ఘన నివాళి



నాతవరంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంపీపీ లక్ష్మణమూర్తి, జెడ్పీటీసీ అప్పలనర్స



రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం/మాకవరపాలెం: ప్రజా సంకల్పయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలను నూటికి నూరు శాతం నెరవేర్చి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా రంజక పాలన కొనసాగిస్తున్నారని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. ప్రతిపక్ష నేతగా జగన్ చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా నర్సీపట్నం పట్టణంలోని అబిద్ సెంటర్, మాకవరపాలెం మండలం కొండల అగ్రహారంలో మహానేత డాక్టరు వైఎస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2017 నవంబర్ 6న ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద నుంచి చేపట్టిన సంకల్ప యాత్ర శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వద్ద ముగిసిందన్నారు. 3,648 కిలోమీటర్ల మేర నడిచి ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకున్నారన్నారు. సీఎం పాలన దేశంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, ఎంపీపీ సత్యనారాయణ, పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్, ఏకా శివ, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు షేక్ ఉన్నీసాబేగం, కర్రి శ్రీనివాసరావు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గొలుసు నర్సింహమూర్తి, ఏఎంసీ వైస్ చైర్మన్ మళ్ల గణేష్, కౌన్సిలర్లు సిరసపల్లి నాని, బేతిరెడ్డి రత్నం, సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, పార్టీ మహిళా అధ్యక్షురాలు బయపురెడ్డి గణమ్మ, పార్టీ నాయకులు లలిత, శారద, అన్నపూర్ణ, చిటికెల రమణ, పెట్ల భద్రాచలం, బొడ్డేటి రమణ, పిల్లా శ్రీను, సర్వం పాల్గొన్నారు.

నాతవరం: ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, జెడ్పీటీసీ కాపారపు అప్పలనర్స అన్నారు. ప్రజా సంకల్ప యాత్ర ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం నాతవరంలో పార్టీ నాయకులు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలను వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి ఎనలేని కృషి చేస్తున్న సీఎం జగన్‌కు ఎల్లప్పుడూ అండగా నిలవాలన్నారు. రాబోయే ఎన్నికల్లో సీఎంగా జగన్‌ను ఎన్నుకోవాలని కోరారు. వైస్ ఎంపీపీ మైనం నాగగోపి, ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి వరహాలబాబు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శెట్టి నూకరాజు, పైల పోతురాజు, ఎంపీటీసీలు పాలుపర్తి వెంకటరమణ, తమరాన లోవకృష్ణ, సర్పంచ్‌లు శ్రీనివాస్, అచ్చింనాయుడు, కె.సత్యనారాయణ, వేమల సూర్యనారాయణమూర్తి, పోలిరెడ్డి రాజు, వేమల సూరిబాబు పాల్గొన్నారు.

రూ.5 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత



చెక్కు అందజేస్తున్న ఎంపీపీ రామధర్మజ తదితరులు

మాడుగుల: జంపెన గ్రామానికి చెందిన నిరుపేద యువకుడు దేవగుప్తాపు సురేష్‌కుమార్ ఇటీవల బైక్ ప్రమాదంలో మృతి చెందాడు. అతడి భార్య, ఐదేళ్లలోపు ఉన్న ఇద్దరు చిన్నారుల పోషణ కష్టతరంగా మారడంతో సర్పంచ్ గురువునాయుడు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి బాధిత కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.5 లక్షలు మంజూరు చేయించారు. ఈ మేరకు స్థానిక ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీ వేమవరపు రామధర్మజ సోమవారం ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నేమాల గురువునాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు శానాపతి గంగాధర్, యన్నంశెట్టి వెంకటరావు, పచ్చికూర మాణిక్యం, తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా త్రిమూర్తులుకు ఉద్యోగోన్నతి

రెవెన్యూ కార్యాలయ సిబ్బంది అభినందనలు



కె.కోటపాడు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఎన్నికల సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న జె.త్రిమూర్తులకు డిప్యూటీ తహసీల్దార్‌గా ఉద్యో గోన్నతి లభించింది. యలమంచిలి తహసీల్దార్ కార్యాలయ రీసర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా నియమితులయ్యారు. 2002 నుంచి 2014 వరకూ కె.కోటపాడు మండలంలో వీఆర్వోగాను, చీడికాడ మండలంలో ఆర్ఐగాను, మరలా కె.కోటపాడు మండలంలోనే సీనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించారు. ఉద్యోగోన్నతి పొందిన త్రిమూర్తులును రెవెన్యూ కార్యాలయ సిబ్బంది అభినందించారు.

గొండుపాలెంలో 112 మందికి వైద్య పరీక్షలు



అంగన్‌వాడీ చిన్నారులను పరీక్షిస్తున్న వైద్యాధికారి నిర్మల

కె.కోటపాడు: ఫ్యామిలీ డాక్టరు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల తెలిపారు. సోమవారం గొండుపాలెంలో 112 మంది రోగులను పరీక్షించడంతోపాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఇక్కడ రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌వీ అచ్చియ్యమ్మ, హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు, అంగన్‌వాడీ కార్యకర్తలు షేక్ షకీనా, రమాదేవి పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: మండలంలో రెండు గ్రామాల్లో సోమవారం ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా కె.జె.పురం పీహెచ్‌సీ పరిధి మాడుగుల సచివాలయం -2లో నిర్వహించిన వైద్య శిబిరంలో 65 మంది రోగులను వైద్యాధికారి కె. లీలాప్రసాదు పరీక్షించారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. కింతలి పీహెచ్‌సీ పరిధి సత్యవరంలో వైద్యాధికారి నాగదివ్య రోగులకు సేవలందించారు.

9 నుంచి 'ఏపీకి జగనే ఎందుకు కావాలంటే'

గొలుగొండ: చీడిగుమ్మలలో ఈ నెల 9వ తేదీ నుంచి ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం ప్రారంభం కానుందని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ తెలిపారు. 9న చీడిగుమ్మల-1, 10న చీడిగుమ్మల-2, 14న పప్పుశెట్టిపాలెం, 15న జోగుంపేట, 16న గొలుగొండ, 17న కొత్తమల్లంపేట, 20న చోద్యం, 21న లింగంపేట, 22న ఏఎల్‌పురం-1, 23న ఏఎల్‌పురం-2 నిర్వహిస్తామన్నారు. పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు తప్పకుండా హాజరు కావాలని కోరారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు, నెరవేర్చిన హామీలు, మాజీ సీఎం చంద్రబాబు చేసిన మోసాలు ప్రజలకు వివరిస్తామన్నారు.

స్పందనకు గైర్హాజరైతే చర్యలకు సిఫార్సు

నర్సీపట్నం ఆర్డీవో జయరాం



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: స్పందన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఆర్డీవో హెచ్.వి.జయరాం అధికారులను ఆదేశించారు. పంట కాలువలో చెత్తాచెదారం వేయటం వల్ల పూడిక పోయి పొలాలకు నీరు రావటం లేదని నర్సీపట్నం మున్సిపాలిటీ పెద్ద చెరువు ఆయకట్టు రైతులు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. రైతుల పొలాలకు సాగునీరు ఇబ్బంది లేకుండా కాలువ పూడిక తీయించాలని ఇరిగేషన్ ఏఈ రవికుమార్‌కు ఆర్డీవో సూచించారు. భూసమస్యలు, ఇళ్ల స్థలాలు, వివిధ రకాల సమస్యలపై 17 అర్జీలు వచ్చాయి. స్పందన ఫిర్యాదుల పట్ల అధికారులు నిర్లక్ష్యం వహించకుండా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. స్పందనకు కొంత మంది అధికారులు రాకపోవటంపై అసహనం వ్యక్తం చేశారు. వారంలో ఒక రోజు జరిగే స్పందనకు అధికారులు రాకుండా అసిస్టెంట్లను పంపటం సరికాదని, పరిస్థితి ఇదే విధంగా ఉంటే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు.

ఏబీ పీఎంజేఏవై కార్డుల పంపిణీ



ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రాజేశ్వరి

దేవరాపల్లి: ప్రజలు ఆరోగ్య సంరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరంతరం కృషి చేస్తున్నాయని ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి అన్నారు. దేవరాపల్లిలో ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి ఇన్ ఆరోగ్య యోజన(ఏబీ పీఎంజేఏవై) - డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సంరక్షణ పథకం కింద మంజూరైన కార్డులను ప్రజలకు సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్డు ద్వారా లబ్ధిదారులు ఐదు లక్షల రుపాయలు విలువైన వైద్య సేవలు ఉచితంగా పొందవచ్చన్నారు. సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి, ఈవోపీఆర్డీ సంతోష్ నళిని, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసరావు, రత్న, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ముమ్మరంగా పూడికతీత పనులు



ప్రత్యేక పారిశుధ్య పనులు చేపడుతున్న దృశ్యం



పేరుకుపోయిన పూడిక తొలగించిన దృశ్యం

రావికమతం: కొత్తకోట మోదకొండమ్మ కాలనీ(దళితవాడ)లోని కాలువల్లో పేరుకుపోయిన చెత్త, మురుగు తొలగించేందుకు పంచాయతీ పాలక వర్గం ఐదు రోజులుగా ప్రత్యేక చర్యలు చేపట్టింది. పారిశుధ్య సిబ్బందితోపాటు అదనంగా కూలీలను ఉపయోగించి ఈ కార్యక్రమం నిర్వహిస్తోంది. ఇక్కడ కాలువలన్నీ పూర్తిగా పూడికపోయి నీరు పారక దుర్గంధం వెలువడటంతోపాటు దోమల బెడద ఎక్కువైందని కాలనీ వాసులు పంచాయతీ అధికారులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నారు. కాలువలపై పలకలు, ఆక్రమణలు తొలగిస్తూ పూర్తిగా పూడిక తీయిస్తున్నామని, గ్రామస్తులు సహకరించాలని సర్పంచ్ కోన లోవరాజు, ఉప సర్పంచ్ పందల దేవా కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ -3 పైల చినమ్మలు, నాయకులు పూడి నాగరాజు, తురాల శ్రీనివాసరావు, వేమవరపు సత్తిబాబు పాల్గొన్నారు.

నేడు ఆశ కార్యకర్తల సమావేశం

మాడుగుల రూరల్: ఆశ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఆశ కార్యకర్తల సమావేశం కె.జె.పురం పీహెచ్‌సీలో నిర్వహించనున్నట్లు కమ్యూనిటీ హెల్త్ అధికారి సిహెచ్.పుష్పమ్మ సోమవారం తెలిపారు. ఈ సమావేశానికి విధిగా హాజరు కావాలని కోరారు. కింతలి పీహెచ్‌సీలో ఆశ కార్యకర్తలు సమావేశం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి కె.ఎం.నాయుడు తెలిపారు.

ఓటర్ల నమోదుపై పార్టీ శ్రేణులు దృష్టి సారించాలి

- ఈ నెలాఖరులో సామాజిక సాధికార బస్సుయాత్ర
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, పక్కన పార్టీ సీనియర్ నాయకుడు వెంకట్రావు

చోడవరం: బూత్ స్థాయిలో ఓటర్ల నమోదుపై కార్యకర్తలంతా ప్రత్యేక శ్రద్ధ పెట్టి పని చేయాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాలకు చెందిన పార్టీ ప్రధాన నాయకులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ డిసెంబరు ఒకటో తేదీతో ఓటర్ల నమోదు, తప్పుడు ఓటర్ల తొలగింపు ప్రక్రియ ముగుస్తున్నందున అర్హులైన ఓటర్ల నమోదుపై పార్టీ శ్రేణులు దృష్టి సారించాలన్నారు. బూత్ స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసి ఇంటింటికీ వెళ్లి అర్హత ఉన్న ఓటర్లను నమోదు చేయించాలన్నారు. అనర్హులైన ఓటర్లను తొలగించేందుకు జాబితా సిద్ధం చేసి సంబంధిత బూత్ లెవిల్ ఆఫీసర్లకు అందించాలన్నారు. ప్రతీ గ్రామ సచివాలయ పరిధిలో కమిటీలను వెంటనే నియమించాలని సూచించారు. ఎందుకు మరలా జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలనే అంశంపై ఈ నెల 8వ తేదీన మండలాల వారీగా సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ఈ నెలాఖరులో సామాజిక సాధికార బస్సు యాత్ర నిర్వహించే అవకాశం ఉందన్నారు. రోలుగుంటలో ప్రారంభించే ఆ యాత్రకు ఐదు వేల మోటారు సైకిళ్లతో పది వేల మంది కార్యకర్తలు స్వాగత ర్యాలీ చేయాలని, వడ్డాది కాలేజీ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించేలా ఏర్పాట్లకు సిద్ధం కావాలని ధర్మశ్రీ పిలుపు ఇచ్చారు. మండల, గ్రామ, వార్డు, బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలను కలుపుకొని పార్టీని మరింతగా బలోపేతం చేయాలని సూచించారు. పార్టీ సీనియర్ నాయకుడు చొక్కాకుల వెంకట్రావు, డీసీఎంఎస్ చైర్మన్ పల్లా నర్సింగరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, మండల అధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు, కంచిపాటి జగ్గారావు, గుమ్ముడి సత్యదేవ్, శేషు, మాజీ జెడ్పీటీసీ బొడ్డేడ సూర్యనారాయణ, పట్టణాధ్యక్షుడు దేవరపల్లి సత్య, చోడవరం ఉప సర్పంచ్ పుల్లేటి వెంకట్రావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ పాల్గొన్నారు.

బి.సింగవరంలో ప్రత్యేక వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

మాడుగుల రూరల్: చీడికాడ మండలం బి. సింగవరంలో డయేరియా అదుపులోకి వచ్చింది. వారం రోజులుగా ఇక్కడ డయేరియా వ్యాపించి పలువురు మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రితోపాటు చీడికాడ పీహెచ్‌సీలో చికిత్స పొందారు. సోమవారం సైతం గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇంటింటికీ వెళ్లి ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు, ఇతర సిబ్బంది పరీక్షలు చేస్తున్నారు. పారిశుధ్య పనులు చేపట్టి, బ్లీచింగ్ పిచికారీ చేస్తున్నారు. రక్షిత పథకాన్ని బ్లీచింగ్‌తో శుభ్రం చేసినట్లు పంచాయతీ కార్యదర్శి రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ శరగడం సన్యాసినాయుడు మాట్లాడుతు కాచి చల్లార్చిన నీటిని తాగాలని, మాంసం, చేపలు తినకూడదని గ్రామస్తులకు సూచించారు. అధికారులకు, ఆరోగ్య సిబ్బందికి సహకరించాలని కోరారు.

రోగులకు మరింత మెరుగైన వైద్యం

పీహెచ్‌సీల అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎంపీపీ లక్ష్మణమూర్తి



మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మణమూర్తి

నాతవరం: పీహెచ్‌సీల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు సకాలంలో అందించాలని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి తెలిపారు. నాతవరం, గునుపూడి పీహెచ్‌సీల అభివృద్ధి కమిటీ సమావేశంలో సోమవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో సిబ్బంది వివరాలతోపాటు వైద్య సిబ్బందికి కల్పించాల్సిన సౌకర్యాలపై రెండు పీహెచ్‌సీల వైద్యాధికారులు ప్రసన్న, పద్మప్రియలను అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీ పరిసరాలు ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆస్పత్రికి వచ్చే రోగులతో మర్యాద పూర్వకంగా మెలిగి వారికి వైద్యం అందించి మన్ననలను పొందాలన్నారు. ప్రజా ప్రతినిధులు, ఆస్పత్రి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

30 అడుగులకు ప్రత్యామ్నాయ రోడ్డు విస్తరణ

ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



హాజరైన భవన యజమానులు

నర్సీపట్నం: భవన యజమానుల అభీష్టం మేరకు నర్సీపట్నం వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి పెదబొడ్డేపల్లి వరకు ప్రత్యామ్నాయ రోడ్డును 30 అడుగులకు విస్తరిస్తున్నామని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం భవన యాజమానులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం రోడ్డు విస్తరణకు రూ.6 కోట్లు మంజూరు చేసిందని ఎమ్మెల్యే తెలిపారు. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా 40 అడుగులకు విస్తరించనున్నామని, ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే చెప్పాలన్నారు. 30 అడుగుకు విస్తరించాలని భవన యజమానులు కోరగా, ఎమ్మెల్యే సానుకూలత వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ తమరాన అప్పలనాయుడు, మాజీ వైస్ చైర్మన్ గొలుసు నర్సింహమూర్తి, కమిషనర్ రవిబాబు, టౌన్ ప్లా నింగ్ అధికారులు, కౌన్సిలర్లు పాల్గొ న్నారు.

గుడివాడ వీఆర్వోపై చర్యలు తీసుకోవాలని ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న రైతు, సీపీఐ నాయకులు

రావికమతం: ఒకరికి వారసత్వంగా వచ్చిన భూమిని వేరొకరి పేరున ఆన్‌లైన్ చేసిన వీఆర్వోపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద బాధిత రైతుతోపాటు సీపీఐ నాయకులు సోమవారం ఆందోళన చేపట్టారు. గుడివాడ రెవెన్యూ పిల్లవానిపాలెం గ్రామ రైతు యన్నంశెట్టి సత్తిబాబు భూమిని అతడికి ధ్రువీకరించి, దానిపై ఎటువంటి రెవెన్యూ పనులు జరగకుండా అప్పటి తహసీల్దార్ కనకారావు రెడ్ మార్క్‌లో పెట్టారు. ఆ భూమిని గ్రామానికి చెందిన గోకాడ రాజు పేరున వీఆర్వో నారాయణరావు ఆన్‌లైన్ చేయడం ఆ వెంటనే వేరొకరి పేరున రిజిస్ట్రేషన్ చేయించారన్నారు. దీన్ని పరిశీలించి వీఆర్వో చర్యలు చేపట్టాలని బాధిత రైతు, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు శివలంక కొండలరావు, సీపీఐ మండల కార్యదర్శి జి.జోగిరాజు డిమాండ్ చేశారు.

చెత్తబుట్టల పంపిణీ



సర్పంచ్‌లకు చెత్తబుట్టలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రామధర్మజ

మాడుగుల: ప్రతి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా చెత్తబుట్టలు పంపిణీ చేస్తున్నట్లు ఎంపీపీ వేమవరపు రామధర్మజ తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సర్పంచ్‌లకు వీటిని ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. మండలంలో 23 సచివాలయాల పరిధిలో 31 వేల చెత్తబుట్టలు పంపిణీ చేస్తున్నామన్నారు. ఎంపీడీవో మీనాకుమారి మాట్లాడుతూ ఈ బుట్టలు ప్రతి గడపకు అందజేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు శానాపతి గంగాధర్, జంపెన సర్పంచ్ గురువునాయుడు పాల్గొన్నారు.

విద్యుత్తు సమస్యల నివారణకు పటిష్ట చర్యలు

రోలుగుంట: విద్యుత్తు సమస్యల నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు మండల విద్యుత్ శాఖాధికారి పద్మనాభం తెలిపారు. స్థానిక పంచాయతీలో విద్యుత్ సరఫరాలో అంతరాయం, స్తంభాల వద్ద వైర్ల నుంచి పొంచి ఉన్న ప్రమాదాలను, లోడు నియంత్రణ చర్యలను చేపట్టారు. ఈ మేరకు లోడున్న స్తంభాలకు లైన్లను వేరొక స్తంభానికి మార్చి సిబ్బందితో సరి చేయించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాన్ని అడిగి తెలుసుకున్నారు. సబ్ స్టేషన్ పరిధిలో వినియోగదారుల అవసరం మేరకు సక్రమంగానే విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. వీధి లైన్లు, వివిధ గ్రామాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల సమయంలో ముందుగానే పవర్ కట్ విషయాలపై తెలియజేస్తున్నామని, ఈ సమస్యలను గమనంలో ఉంచుకుని సహకరించాలని సూచించారు.